## బీసీ బిడ్డను గెలిపించాలి



మల్కాపూర్ గ్రామంలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


చేవెళ్ల రూరల్, మే 8 : చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కాలె యాదయ్య బుధవారం మల్కాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల ముద్దు బిడ్డ, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే మన వాణి వినిపించి చేవెళ్ల అభివృద్ధిలో భాగస్వాములు అవుతారన్నారు. ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఎదిరె రాములు, శేరి శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాసాని గెలుపే లక్ష్యంగా..



షాబాద్: శంకర్‌పల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల రూరల్, మే 8 : చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా గులాబీ నాయకులు గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో ఎటు వెళ్లినా బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బుధవారం మండల పరిధి అంతారం, అనుబంధ గ్రామం నవలయపల్లి, హస్తేపూర్, ఆలూర్ అనుబంధ గ్రామం వెంకన్నగూడ, మీర్జాగూడ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపించి మన ప్రాంత అభివృద్ధికి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెద్దొల్ల ప్రభాకర్, అంతారం, హస్తేపూర్ మాజీ సర్పంచ్‌లు సులోచనాఅంజన్‌గౌడ్, వెంకటయ్య, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎదిరె రాములు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కసిరె వెంకటేశ్, నాయకులు శివనీలచింటూ, నర్సింహులు, గిరిధర్‌రెడ్డి, ఈర్లపల్లి, స్వర్ణలతాభాస్కర్, బి.రామస్వామి, సీహెచ్.రాము, మహేశ్, అబ్దుల్ ఘని, కావలి శేఖర్, శేరి రాజు, వీరాజంనేయులు, నవీన్, దండు సత్యం, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లోని సురంగల్ గ్రామంలో ఈవీఎం నమూనాను ఓటర్లకు చూపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి**

షాబాద్ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లరూరల్: అంతారం గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**ఊపందుకున్న బీఆర్‌ఎస్ ప్రచారం**

మొయినాబాద్ :ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరంగా చేశారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు గడప గడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర చేపడుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, ప్రభంజనం చూసిన బీఆర్‌ఎస్ నాయకుల్లో జోష్ పెరిగింది. బీజేపీ, కాంగ్రెస్‌కు చెమటలు పట్టించే విధంగా బీఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న ఆర్డీవో

ఇబ్రహీంపట్నం, మే 8 : ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆయన తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ..ఇప్పటికే ఓటర్లను చైతన్యపర్చేందుకు ఎన్నికల కమిషన్ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 3370 పోస్టల్ బ్యాలెట్ ఓట్లున్నాయన్నారు. బుధవారం నాటికి 3123ఓట్లు పోలయ్యాయన్నారు. మిగిలిన ఓట్లు వేయటం కోసం ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని మరో రెండు రోజులకు పొడిగించినట్లు తెలిపారు.

## బీఆర్‌ఎస్‌తోనే గిరిజన తండాల అభివృద్ధి

కడ్తాల్, మే 8 : బీఆర్‌ఎస్ పాలనలోనే గిరిజన తండాలు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించాయని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బుధవారం మండల పరిధిలోని గాన్గుమార్ల తండా గ్రామ పంచాయతీలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రె స్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు గ్రామా ల్లో తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు పాండు, శ్రీను, భీమన్‌నాయక్, మోతీలాల్, రతన్ పాల్గొన్నారు.

# జోరుగా ఇంటింటి ప్రచారం

- భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా ప్రచారం
- పాల్గొన్న గులాబీ శ్రేణులు



మంచాల : లోయపల్లిలో ఉపాధి కూలీలను కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న క్యామ ఆరోని



ఇబ్రహీంపట్నంరూరల్ : ఎలిమినేడులో బీఆర్‌ఎస్ నాయకులు చంటి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 8 : బీఆర్‌ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే పేదలకు సరైన న్యాయం జరుగుతోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు అన్నారు. ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా ఎలిమినేడు, నాగన్‌పల్లి, తులేకలాన్, కప్పాడు, తుర్కగూడ, పోచారం, ఉప్పరిగూడ, ఎలిమినేడు, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, రాయపోల్, దండుమైలారం, ముకునూరు, నెర్రపల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉదయం, సాయంత్రం వేళలో పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహించారు.

**బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం**

పెద్దఅంబర్‌పేట : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా మున్సిపాలిటీలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ సీనియర్ నాయకుడు దేవిడి విజయ్‌భాస్కర్‌రెడ్డి కోరారు. కౌన్సిలర్ పరశురాంనాయక్, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, ఇతర నేతలతో కలిసి తట్టిఅన్నారంలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జాల సూరయ్య, సుక్క భిక్షపతి, భూషణ్, రవి ముదిరాజ్, కిరణ్‌గౌడ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. కుంట్లూరులో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఈదమ్మల బలరాం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జోర్క రాము, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

**భారీ మెజార్టీతో గెలిపించాలి**

యాచారం, మే8: భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి అచ్చన దానయ్య అన్నారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. నమూనా ఈవీఎంలను ప్రదర్శిస్తూ ఈవీఎం మిషన్‌లో 2వ నంబర్‌పై నొక్కి కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీరప్ప, జంగయ్య, పర్వతాలు, అంజయ్య తదితరులున్నారు.

**తుర్కయంజాల్ :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్‌ఎస్ శ్రేణులు భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో రాగన్నగూడ మాజీ సర్పంచ్ కందాడి లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని..**

మంచాల : బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎల్లమ్మతండా, బోడకొండ, లోయపల్లి గ్రామాల్లో క్యామ మల్లేశ్ కుమార్తె ఆరోని, పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, ఎంపీటీసీ అనిత, మండల నాయకులు వెంకటేశ్, బద్రినాథ్ గుప్త, జానయ్య గౌడ్, నారి యాదయ్య, సదానంద్, ఉయ్యాల జానయ్య, లింగస్వామి, పరమేశ్, రవి, మల్లేశ్, నవీన్, లోకేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



యాచారం : గడ్డమల్లయ్యగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**అబ్దుల్లాపూర్‌మెట్ :** భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బండరావిరాల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని వినిపించి హామీలను అమలు చేసే విధంగా పోరాటం చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దంతూరి అనిత, నాయకులు దంతూరి మహేందర్‌గౌడ్, కార్యకర్తులు పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట : తట్టిఅన్నారంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దేవిడి విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు



తుర్కయంజాల్:రాగన్నగూడలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

## 10 వరకు పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 8(నమస్తే తెలంగాణ): ఓటర్ల ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం గడువును ఈనెల 10 వరకు పొడిగించిందని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నాటికే గడువు ముగియగా..ఎన్నికల సంఘం మరో రెండు రోజులపాటు గడువును పొడిగించిందన్నారు. బుధవారం నాటికి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 19,920 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 16,088 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటా : జడ్పీటీసీ

కడ్తాల్, మే 8 : నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కటిక రామచంద్రయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ బుధవారం ఉదయం బాధితుడికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వంశీ, కేతావత్ సాయికుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

## స్వాగత తోరణం పడి మహిళ మృతి

మొయినాబాద్, మే 8 : ఈదురు గాలులకు స్వాగత తోరణం ఓ మహిళ మీదపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల పరిధిలోని చిన్నమంగళారంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎండీ జహీరా బేగం (45) మంగళవారం సాయంత్రం కూరగాయల మార్కెట్‌కు వచ్చింది. అదే సమయంలో ఈదురు గాలులు వీయడంతో అక్కడ బీరప్ప ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన స్వాగత తోరణం కట్టెలు విరిగి ఆమె తల మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్వాగత తోరణం ఏర్పాటు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మన్నె గెలుపు.. అభివృద్ధికి మలుపు



షాద్‌నగర్ పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తూరు, మే 8: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె గెలుపుతోనే పాలమూరు అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలోని మల్లాపూర్, మల్లాపూర్ తండా, మక్తగూడ, ఇన్ముల్‌నర్వ, పెంజర్ల తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. కొత్తూరు మున్సిపాలిటీలో దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గూడూరు, మక్తగూడ, మల్లాపూర్, మల్లాపూర్ తండాల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఇన్ముల్‌నర్వలో బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు పెంటనోళ్ల యాదగిరి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పెంజర్లలో దామోదర్‌రెడ్డి అధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గూడూరులో మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మెండె కృష్ణయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు కొస్గి శ్రీనివాసులు, సోమ్లానాయక్, నాయకులు గోపాల్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్‌లు బ్యాగరి సత్తయ్య, కాట్నరాజు, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం, నాయకులు చెన్నారెడ్డి, దయ్యాల పాండు, సదానందం, దేశాల భీమయ్య, శేఖర్, జైపాల్, భీమయ్య, ఎలుగని రాములుగౌడ్, బాల్‌రాజ్, రాజ్యలక్ష్మి, దేశాల జైపాల్, జంగగళ్ల శివకుమార్, దామోదర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, దేశాల భీమయ్య పాల్గొన్నారు.

**ప్రచారానికి అపూర్వ స్పందన**

షాద్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ తనదైన శైలిలో దూసుకెళ్తుంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తు బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేస్తున్నారు. పోలింగ్ తేది సమీపిస్తుండంతో పార్టీ శ్రేణులు ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేశారు. మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. బుధవారం కొందుర్గు, చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్ మండలాలతో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరుతున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏనాడు కూడ పాలమూరు ప్రజలను పట్టించుకోలేదని, పాలమూరు ప్రజల ఓట్లను అడిగి హక్కు ఆ పార్టీకి లేదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలకు సూచించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని అభిప్రాయపడుతున్నారు. ఆయా కార్యక్రమాల్లో మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొత్తూరు : గూడూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మె సత్యనారాయణ

# కేటీఆర్ రోడ్డుషోకు తరలిన శ్రేణులు



ఆమనగల్లు నుంచి కల్వకుర్తి రోడ్‌షోకు బయలుదేరుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కడ్తాల్, మే 8 : బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్డుషోకు మండలం నుంచి జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ వాహనాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రోడ్డుషోకు తరలివెళ్లారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చీరాంనాయక్, గోపాల్, మంజుల, ప్రియ, నాయకులు వీరయ్య, వసంత, హరిచంద్, లోకేశ్, సాయిలు పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోకు ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలోని 13 గ్రామ పంచాయతీలోని బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున బయలు దేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు దోనాదుల కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, ఎంగలి రఘు, కోట శ్రీనివాస్, కొమ్ము ప్రసాద్, ఎనుమల్ల రమేశ్, జంతుక కిరణ్, చలిచీమల సతీశ్, మత్తయ్య, రంజిత్, ప్రవీణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## కాటేసిన కరెంటు తీగలు

- పంక్చర్ దుకాణంపై వైరు తెగిపడి అబ్దుల్లాపూర్‌మెట్‌లో వ్యక్తి
- తెగిన వైరు తగిలి కుంట్లూరులో ఐదేండ్ల బాలుడి మృతి

పెద్దఅంబర్‌పేట, మే 8: కరెంటు తీగలు రెండు కుటుంబాల్లో చీకట్లు నింపాయి. ఈదురుగాలులతో కూడిన ఒక్క వర్షానికే తెగిన కరెంటు తీగలు వేర్వేరుచోట్ల రెండు ప్రాణాలను బలిగొన్నాయి. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో తెగిన విద్యుత్తు తీగ తగిలి ఓ ఐదేండ్ల బాలుడు మృతిచెందగా, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఓ పంక్చర్ షాపుపై కరెంటు తీగలు పడి నిర్వాహకుడు ప్రాణాలు వదిలాడు. పోలీసుల కథనం ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బీసీ కాలనీకి చెందిన మహ్మద్ పర్వీజ్ (36) జాతీయ రహదారికి ఆనుకుని హనుమాన్ టెంపుల్ సమీపంలో పంక్చర్ షాపు నడుపుతున్నాడు. మంగళవారం రాత్రి భారీ వర్షం కురుస్తున్నది. ఎప్పటిలాగే దుకాణం మూస్తుండగా.. విద్యుత్తు తీగలు రేకుల షాప్‌పై పడ్డాయి. పర్వీజ్‌కు షాక్ తగిలి పడిపోయాడు. ఆ పక్కనే ఉన్న అతడి బామ్మర్ది వెంటనే పర్వీజ్‌ను అంబులెన్సులో వనస్థలిపురంలోని ఏరియా దవాఖానకు తరలించగా.. అప్పటికే పర్వీజ్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పర్వీజ్ భార్య మహ్మద్ షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేశ్‌నాయక్ తెలిపారు.

**సెలవులని నాన్నతో వెళ్లి.. కరెంటు తీగకు బలి**

ఈదురుగాలులకు కరెంటు తీగ తెగిందని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఓ ఐదేండ్ల చిన్నారికి నూరేళ్లు నిండాయి. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన అలకుంట జమ్ములయ్య 15 ఏండ్లుగా హయత్‌నగర్‌లోని ముదిరాజ్ కాలనీలో ఉంటున్నాడు. చెత్త సేకరిస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. రోజూ భార్యతో కలిసి ఆటోలో చెత్త సేకరించేందుకు వెళ్లేవాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే భార్యతో కలిసి ఇంట్లో నుంచి బయలుదేరాడు. సెలవులు కావడంతో వారి ముగ్గురు పిల్లలు కూడా జమ్ములయ్య వెంట వచ్చారు. అంతా కలిసి కుంట్లూరు సన్‌రైస్ కాలనీలోని రోడ్‌నంబర్ 3కు వెళ్లారు. జమ్ములయ్య ఆటో నడుపుతుండగా.. భార్య చెత్త సేకరిస్తున్నది. ఎల్‌కేజీ చదువుతున్న ఐదేండ్ల కొడుకు శివశంకర్ మూత్రం పోసేందుకు ఆటో దిగాడు. కొంచెం దూరంలోని ఖాళీ ప్రదేశంలో మూత్రం పోస్తుండగా.. అప్పటికే అక్కడ తెగిపడిన విద్యుత్తు తీగ కాలికి తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పెద్దఅంబర్‌పేట విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం కారణంగానే తన కొడుకు ప్రాణాలు వదిలాడని, వారిపై చర్యలు తీసుకోవాలని శివ తండ్రి జమ్ములయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హయత్‌నగర్ పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి భారీ వర్షంతో కూడిన ఈదురుగాలులు వీచాయి. ఈ సమయంలో తీగ తెగిపడిందని, ఈ విషయంపై విద్యుత్తు సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఉదయం వరకు పట్టించుకోకపోవడంతోనే ఓ ప్రాణం గాల్లో కలిసిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకరం



ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం, మే 8 : దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకరమని.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆ పార్టీ అభ్యర్థి జహంగీర్‌తో కలిసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత పదేండ్ల కాలంలో బీజేపీ దేశానికి చేసిందేమీ లేదన్నారు. ఆ పార్టీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని.. హత్యలు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు, వేధింపులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. అందులో భాగంగానే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వంటి వారి అరెస్టులు అని పేర్కొన్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక బీజేపీలో చేరిన వారికి క్లీన్‌చీట్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.